క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అయ్యవారిగూడెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేందర్

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం, ఎర్రుపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ సురేందర్ పరిశీలించారు. కేంద్రాల్లో వసతులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా అవసరైన సదుపాయాలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏలేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

మధిర: మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు టెలీ మానస్, యాంటీ డ్రగ్స్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జయదాస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ వైద్యులు పృథ్వీరాజ్ నాయక్, రామ్మోహన్ నాయక్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మానసిక ఒత్తిడి, పరీక్షల్లో ఫెయిల్ కావడం, మరికొందరు తాగుడు మానలేకపోవడం, ఇతర మానసిక సమస్యల గురించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.లత, తౌరియా, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటినే తాగాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈఈ ప్రియాంక

ఎర్రుపాలెం: ప్రజలు సురక్షితమైన మిషన్ భగీరథ నీటినే తాగాలని భగీరథ ఏఈఈ యన్నం ప్రియాంక అన్నారు. గురువారం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని ప్రజలకు భగీరథ నీటిపై అవగాహన కల్పించారు. పలు గ్రామాల్లో తాగునీటి వనరుల వద్ద శుద్ధ జల బాండాగారాలు, చేతిపంపుల దగ్గర చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏలేశ్వరరావు తదితరులున్నారు.

విద్యారంగంలోనే ఉపాధి లభిస్తుంది..

తల్లాడ: విద్యారంగంలోనే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని మోటివేషనల్ స్పీకర్ ఎండి.నవాబ్ పాషా అన్నారు. మండలంలోని నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఎస్‌సీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుకు డబ్బు ఆటంకం కాదన్నారు. కార్యక్రమంలో నూతనకల్ పాఠశాల హెచ్‌ఎం ఏ.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థుల వనసమారాధన

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామ శివారులోని మామిడి తోటలో గురువారం న్యూలిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులకు వనసమారాధన నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఫైర్ మ్యాజిక్ షో, టాకింగ్ డాల్ పప్పెట్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిమిక్రీ కార్యక్రమం హాస్యాన్ని పండించింది. కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏఓ నరసింహరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కొండల్‌రావు

బోనకల్: గ్రామీణ వైద్యులపై దాడులు ఆపాలని ఆర్ఎంపీ డబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు బొమ్మినేని కొండల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గ్రామీణ వైద్యులను పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు షేక్ హసన్, కొంగర గోపి, ధనమూర్తి, గౌతమ్, ఆకెన పవన్, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు అరెస్టును ఖండించాలి

మధిర: మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు అక్రమ అరెస్టును ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత గురువారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, కనుమూరు వెంకటేశ్వరరావు, నాయకులు ఉన్నారు.



వరి కోస్తున్న హార్వెస్టర్



యంత్రంతో మొక్కజొన్న విత్తనాలు పెడుతున్న రైతులు



మిరపతోటలో ట్రాక్టర్‌తో పాటు చేస్తున్న రైతు

అగ్రిటెక్.. సాగులో సాంకేతిక విప్లవం

- అన్ని పనులు యంత్రాలతోనే..
- కూలీల కొరతకు చెక్.. సమయం ఆదా
- రైతులకు తప్పిన తిప్పలు

వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వినియోగం వేగంగా పెరుగుతోంది. సమయం, శ్రమ, ఖర్చు ఆదా కావడం, కూలీల కొరత తీరుతుండడంతో అన్నదాతలు పంటల సాగులో యాంత్రీకరణపై ఆసక్తి చూపుతున్నారు.

కొణిజర్ల: వ్యవసాయంలో సంప్రదాయ పద్ధతుల నుంచి అన్నదాతలు బయటకు వస్తున్నారు. కొంత కాలం క్రితం వ్యవసాయం చేయాలంటే కాడెద్దులు, బండి, కలపతో తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు వాడి రైతులు వ్యవసాయం చేసేవారు. ఇది సాంప్రదాయ పద్ధతిలో తాతల తండ్రుల నుంచి వచ్చిన వ్యవసాయ పద్ధతిగా చెప్పుకునేవారు. దీనికి ఖర్చు, సమయం కూడా ఎక్కువగానే ఉండేది. పొలం దున్నే సమయం నుంచి పాటు చేయడం, పంట కోసిన తర్వాత కల్లాల్లో ఎద్దులు, కూలీల సాయంతో పంట నూర్పిడి చేసి ధాన్యం ఇంటికి తీసుకొచ్చేవారు. ఏళ్ల తరబడి ఇదే సాంప్రదాయం కొనసాగింది. అయితే కాలం మారుతున్న కొద్దీ వ్యవసాయంలో కూడా మార్పులు జరిగాయి. సాంప్రదాయ వ్యవసాయానికి సాంకేతిక తోడవ్వడంతో భూమిని నమ్ముకుని వ్యవసాయ చేస్తున్న రైతులు సాగుపై ఆలోచనలు కూడా మారుతున్నాయి. దీంతో వ్యవసాయ రంగంలో వినూత్నమైన మార్పులు వచ్చాయి. అన్నదాతలు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపడంతో అగ్రి కల్చర్‌లో కూడా మార్పులు చేరుతున్నాయి.



చిన్నమునగాలలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు జల్లుతున్న రైతులు

యంత్రాలతో వ్యవసాయం సులభతరం..

ప్రస్తుతం వ్యవసాయానికి ఆధునిక యంత్ర పనిముట్లు వచ్చాయి. గతంలో రైతులు దుక్కి దున్ని చదును చేయాలంటే కనీసం వారం రోజులు పట్టేది. ప్రస్తుతం బలమైన సామర్థ్యమున్న ట్రాక్టర్లు దుక్కి దున్నేందుకు రావడంతో గంట సమయంలోనే దుక్కులు దున్నేస్తున్నాయి. రోటావేటర్లతో దుక్కులు వేసిన భూమిని గుల్ల చేస్తున్నాయి. పత్తి, మిర్చి వంటి పంటలతో పాటుగా.. పంట కోతలు, నూర్పిడిలో కూడా యంత్రాల వినియోగం పెరిగింది. రోజుల తరబడి జరిగే పనులను ప్రస్తుతం గంటల సమయంలోనే పూర్తి అవుతున్నది. డ్రమ్‌సీడర్లతో విత్తనాలు చల్లుతున్నారు. మొక్కజొన్న విత్తనాలు వేయడానికి కూడా ఆధునిక యంత్రాలు వినియోగిస్తున్నారు. డ్రిప్ వంటి పరికరాలు రావడంతో నీటి తడులు కూడా సులభతరం అయ్యాయి. డ్రోన్‌ల సాయంతో మందులు పిచికారీ చేస్తుండటంతో రైతుల పని మరింత సులభతరంగా మారింది. వరి కోసిన తర్వాత గడ్డి కట్టే యంత్రాలు రావడంతో రైతులు గడ్డి భద్ర పరుచుకోవడం కూడా సులభతరంగా మారింది.

అవగాహన పెంచుకోవాలి..



ప్రస్తుతం యంత్రాల వినియోగం బాగా పెరిగింది. రైతులు కూలీలపై ఆధార పడకుండా యంత్రాలతో వ్యవసాయానికి మొగ్గు చూపుతున్నారు. పంటలపై రసాయన ఎరువులు పిచికారీ చేయడం డ్రోన్‌ల ద్వారా, ట్రాక్టర్ మిషన్‌ల ద్వారా చేస్తే మరింత సులభతరం అవుతుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– బాలాజీ, ఏఓ, కొణిజర్ల

సమయం ఆదా అవుతుంది..



యంత్రాల వినియోగం వచ్చిన తర్వాత సమయం, డబ్బు ఆదా అవుతుంది. గతంలో వరి కోయాలంటే కోత కూలీ, నూర్పిడి కూలీ ఇతరత్రా కూలీలతో ఖర్చు తడిచి మోపెడయ్యేది. దీనికి తోడు రోజుల తరబడి పని పట్టేది. ఇప్పుడు యంత్రాల రావడంతో గంటలలో పని పూర్తై సాయంత్రానికి వడ్లు ఇంటికి వస్తున్నాయి.

– తోటపల్లి సీతారాములు, రైతు, కొణిజర్ల

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కిషోర్



వైరాలో విజేతలకు స్వీటు తినిపిస్తున్న జైపాల్, రాజశేఖర్

వైరా: యూత్ కాంగ్రెస్ వైరా నియోజకవర్గ అధ్యక్షుడిగా గరిడేపల్లి కిషోర్, మండల అధ్యక్షుడిగా బొల్లం గోపిచంద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని గురువారం మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ అభినందించారు. నాయకులు మిట్టపల్లి నాగి, దార్నా రాజశేఖర్, మచ్చా రామారావు, ఫణీతి సైదులు, షేక్ రహీం, జాలాది రామకృష్ణ, తిరుపతి శ్రీను, రేచర్ల సత్యం, నాళ్ల రమేష్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా సర్దార్..

ఏన్కూరు: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏన్కూరుకు చెందిన గుగులోత్ సర్దార్ బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అలాగే, ఏన్కూరు మండల అధ్యక్షుడిగా రాజలింగాలకు చెందిన నిమ్మల నాగేశ్వరరావు గెలిచారు. ఈమేరకు ఆయన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు కృతజ్ఞతలు తెలపగా, నాగేశ్వరరావును శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, స్వర్ణ నరేందర్, వేముల కృష్ణప్రసాద్, గిద్దగిరి సత్యనారాయణ, భూక్యా లాలూనాయక్, మేడా ధర్మారావు, గుగులోత్ శోభన్, నల్లమల శివకుమార్, నిమ్మల నరేందర్, సైదులు, శ్రీనివాసరావు, భువనేశ్వరరాజు, సురేష్‌నాయక్ తదితరులు అభినందించారు.

జేఎల్ ఫలితాల్లో ప్రతిభ

– ప్రభుత్వ ఆధ్యాపకులుగా ఎన్నికైన యువతీ, యువకుడు

ఏన్కూరు: జూనియర్ లెక్చరర్ ఫలితాలలో ఏన్కూరు మండలానికి చెందిన యువతీ, యువకుడు ప్రతిభ కనబర్చి ప్రభుత్వ ఆధ్యాపక పోస్టులు సాధించారు. మండలంలోని భగవాన్ నాయక్ తండాకు చెందిన బానోత్ స్పందన, నాచారంకు చెందిన బోర్ర శ్రీను జంతుశాస్త్రం ఆధ్యాపకులుగా ఎంపికయ్యారు. దీంతో వారిని ఆయా గ్రామాల పెద్దలు అభినందించారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా రాజు



ఎన్నికైన పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ సభ్యులు

చింతకాని: పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా పాతర్లపాడు గ్రామానికి చెందిన గుడిమళ్ల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని బైబిలు మిషను చర్చిలో గురువారం పాస్టర్స్ ఫెలోషిప్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాములవారి కుమార్, ప్రధాన కార్యదర్శి గద్దల ఆగమన్ ప్రకాశ్, సంయుక్త కార్యదర్శి కోనకాల శౌరి, కోశాధికారి తంగిరాల రాజేష్, గౌరవ అధ్యక్షుడిగా డేవిడ్ రాజు ఎన్నికయ్యారు.

బీజేపీ బూత్ కమిటీల కన్వీనర్ల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న సుధాకర్‌రెడ్డి

కల్లూరురూరల్: మండలంలోని నారాయణపురంలో 94, 95వ పోలింగ్ బూత్‌లకు బీజేపీ కన్వీనర్లను గురువారం ఎంపిక చేశారు. బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యాన నామినేషన్లు స్వీకరించగా, 94వ బూత్ కన్వీనర్‌గా గూడా శ్రీనివాసరావు, 95వ బూత్‌కు గుమ్మా రామకృష్ణ ఎన్నికవడంతో నియామక పత్రాలను అందజేశారు. నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, వీరం రాజు, మట్టా ప్రసాద్, టి.పుల్లారావు, సుబ్బారాబు, మాడిశెట్టి పద్మావతి, ఆనంగి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్య సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న భాగం హేమంతరావు

మధిర: నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు వూట్ల సాంబయ్య సేవలు మరువలేనివని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మడుపల్లిలో జరిగిన సాంబయ్య 11వ వర్ధంతి సభకు వారు హాజరై మాట్లాడారు. మధిర తాలూకాలో మడుపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సాంబయ్య చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రవిబాబు, కొండలరావు, ప్రకాష్ రావు, రహీం, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు పోటు ప్రసాద్..

చింతకాని: అమరజీవి పోటు ప్రసాద్ ఆదర్శవంతమైన కమ్యూనిస్టు అని భాగం హేమంతరావు అన్నారు. గురువారం మండలంలోని బస్వాపురంలో నిర్వహించిన పోటు ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 8న ఖమ్మంలో నిర్వహించే ప్రసాద్ సంస్మరణ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బ్రహ్మారెడ్డి



బ్రహ్మారెడ్డి

తల్లాడ: తల్లాడ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నారాయణపురం గ్రామానికి చెందిన పాట్టేటి బ్రహ్మారెడ్డి గెలుపొందారు. ఇటీవల ఆలిండియా యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో బ్రహ్మారెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

హస్తకళల చైర్మన్ నాయుడు సత్యంకు సన్మానం

తల్లాడ: రాష్ట్ర చేనేత హస్త కళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యంను గురువారం తల్లాడలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. సత్తుపల్లి పర్యటన ముగించుకొని తల్లాడకు వచ్చిన సత్యంను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగన్న, బాస్కర్‌రావు, రఘుపతిరెడ్డి, జోషఫ్, నగేష్, నవీన్, నగేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం జెడ్పీ హెచ్ఎస్‌లో గురువారం ఉపాధ్యాయులు రాయచోటి సంఘటన మీద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దొడ్డా వరప్రసాద్ మాట్లాడారు. క్రమ శిక్షణ కోల్పోయిన విద్యార్థులు గురు, శిష్యుల సంబంధం దెబ్బతింటుందని తెలిపారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నరసింహారావు, అక్బర్, చంద్రశేఖర్, సరస్వతి, భాగ్యలక్ష్మి, వేదన, భవాని తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఎర్రుపాలెం: ఈ నెల 14,15 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని.. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతిబంధకంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు నిరంతరం ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, నంద్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కంచర్ల శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నాగూర్ వలి, నాయకులు రాజారావు, సూరి, లక్ష్మణరావు, నాగరాజు, రమేష్, మీరాఖాన్, రత్తమ్మ, వెంకట కృష్ణ, అనిత తదితరులు ఉన్నారు.

గ్యారంటీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

వైరా: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ప్రజలను మోసం చేస్తుందని రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ వైఫల్యాల ఛార్జీషీటు విడుదల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. కోటేశ్వరరావు, నరేష్, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కార్తీక్, శ్రీనివాసరావు, మల్లికార్జున్, మల్లేష్, తదితరులున్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ఘనంగా ప్రపంచ మృత్తికా దినోత్సవం



చింతకాని: మాట్లాడుతున్న ఏడీఏ విజయ్ చంద్ర

ముదిగొండ: రైతులు రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని ఏఓ వేణు అన్నారు. ముదిగొండలోని రైతు వేదికలో ప్రపంచ మృత్తికా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని అన్నారు. మట్టి నమూనాలను సేకరించారు. ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

- **బోనకల్:** మండలంలోని బోనకల్, ముష్టికుంట్ల, గోవిందాపురం(ఎల్), రావినూతల, చిన్నబీరవల్లి రైతువేదికల్లో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని గురువారం నిర్వహించగా.. మండల వ్యవసాయాధికారి పసునూరి వినయ్‌కుమార్ మాట్లాడారు.
- **చింతకాని:** మండలంలోని రైతువేదికలో ఏడీఏ విజయ్ చంద్ర రైతులతో సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, వ్యవసాయ విస్తరణాధికారి తేజ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టితోనే మానవ మనుగడ



తల్లాడ: ముద్దునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తల్లాడ/కొణిజర్ల: మట్టితోనే మానవ మనుగడ అని.. అలాంటి మట్టిని కాపాడుకోవడం మనుష్యులుగా మన బాధ్యత అని ఎఫ్ఎంసీ టెరిటరీ మేనేజర్ సురేస్, ప్రిన్సిపల్ డి.శ్రీవాణి తెలిపారు. గురువారం తల్లాడ మండలంలోని ముద్దునూరు పాఠశాలలో, కొణిజర్లలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో.. ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎఫ్ఎంసీ కంపెనీ సిబ్బందితో పాటు రైతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి నేల ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వి.బాబు, బి.నరేష్, ఆర్.సుధాకర్, వెస్ ప్రిన్సిపల్ నవ్య, హెచ్ఓడీలు కేపీ ఐశ్వర్య, దీప్తి, రజిత, రజిని అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో భారీ ర్యాలీ

బుగ్గపాడులో ఆకట్టుకున్న స్టాళ్లు



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులో మెగా ఫుడ్‌పార్క్‌ను గురువారం ప్రారంభించగా సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వరకు వందలాది ద్విచక్రవాహనాలు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హెలీకాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బుగ్గపాడుకు చేరుకున్న రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే రాగమయి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

స్టాళ్ల ఏర్పాటు..

మెగా ఫుడ్‌పార్కు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రాంగణంలో వివిధ శాఖల ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన కొబ్బరి ఉత్పత్తులను ప్రదర్శించారు. తెలంగాణ ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం స్టాల్‌లో డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై అవగాహన కల్పించాలరు. అలాగే, తెలంగాణ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య స్టాల్‌లో ఆయిల్‌పామ్ మొక్కకు కాసికట్టుగా రూ.500, రూ.200, రూ.100 డమ్మీనోట్లను ప్రదర్శించడంతో రైతులు ఆసక్తిగా తిలకించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, ఉద్యానవన శాఖ ఆధ్వర్యాన కూడా స్టాళ్లు ఏర్పాటు చేయగా గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాగా, మంత్రుల పర్యటన సందర్భంగా పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పర్యవేక్షణలో సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వరకు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రతీఒక్కరికి పరీక్షించాకే సభాప్రాంగనంలోకి అనుమతించారు.



ఆయిల్‌పామ్ మొక్కకు డబ్బు కాసినట్లుగా చేసిన ఏర్పాట్లు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



చంద్రకళ

ఎర్రుపాలెం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎర్రుపాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థిని చంద్రకళ ఎంపికైంది. ఈనెల 4న ఖమ్మంలో నిర్వహించిన సీనియర్ మహిళల విభాగంలో ఆమె ప్రతిభ కనబర్చి జట్టులో స్థానం సాధించింది. ఈనెల 7నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లా పాల్గొననున్న చంద్రకళను కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కటికం క్రిస్టోఫర్, ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, హెచ్‌ఎం బీవీఎస్.రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

లయన్స్‌క్లబ్ ఆర్థిక సాయం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన కోవెల కృష్ణయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో బాబాకి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని ఆలయంలో భక్తులకు పలువురు దాతలు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ముదిగొండ: ముదిగొండలోని శ్రీశక్తి భవనంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం గురువారం నిర్వహించారు. తహసీల్దార్ సునీత ఎలిజబెత్ కేక్ కట్ చేసి.. దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. అనంతరం దివ్యాంగులు తమ సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీఎం కల్పన, ఏపీఓ రంగనాయకమ్మ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఇనప ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు ఉపేందర్, మండలాధ్యక్షుడు రాంబాబు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్‌ను అడ్డుకున్న పోలీసులు

ఎర్రుపాలెం: మండలంలోని గురుకుల పాఠశాల సందర్శనకు విచ్చేసిన జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. గురుకులాల సమస్యలపై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా పిలుపు నివ్వడంతో లింగాల కమల్‌రాజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పంబి సాంబశివరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు గురుకులానికి రాగా.. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేష్ సిబ్బందితో కలిసి వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి మాట్లాడారు. తమను గురుకులాల్లోకి పోనివ్వకుండా అడ్డుకున్నారంటే ఎంత ఆధ్వానంగా ఉన్నాయనే విషయం తెలుస్తుందన్నారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కర్, కిశోర్, తిరుపతిరావు ఉన్నారు.